

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,88,891, వెండి 4గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ఛెలిగుడ పనులు చకచకా..

- ప్రాజెక్టు పనులను పరిశీలించిన 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్

- 8లో.



తేనెటీగల దాడిలో 18 మందికి గాయాలు

- 8లో.

## న్యూస్‌రీల్

### ఢిల్లీకి సీఎం నవీన్



సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ 4రోజుల పర్యటన నిమిత్తం దేశ రాజధాని ఢిల్లీకి బుధవారం బయల్దేరి వెళ్లారు. గురు, శుక్రవారాల్లో పలు రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో సమీక్షిస్తారు. ఈ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై పలు అంశాలపై చర్చలు జరిపే అవకాశం ఉంది. వివిధ పథకాల కింద పేరుకుపోతున్న బకాయిల సత్వర విడుదలకు కేంద్రంపై ఒత్తిడి చేయనున్నట్లు సమాచారం. రాష్ట్ర న్యాయపరమైన డిమాండ్ల పట్ల కేంద్రం సానుకూల స్పందనకు అనుబంధ వర్గాలతో సంప్రదింపులు ఈ పర్యటన ప్రధాన ఉద్దేశంగా బీజేడీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రం పట్ల కేంద్రం నిరవధిక వివక్షను నిలదీస్తారని భావిస్తున్నారు. కేంద్రప్రభుత్వ వివక్ష వైఖరి రాష్ట్ర అభివృద్ధికి ఆటంకం కలిగిస్తోందని, ఈ సమస్యలన్నింటినీ సీఎం నవీన్ ఢిల్లీలో ప్రస్తావించి రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరనున్నట్లు పేర్కొన్నాయి. జాతీయ స్థాయిలో మారుతున్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా నవీన్ ఢిల్లీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈనెల 13న ఢిల్లీ పర్యటన ముగిసి తిరిగి రాష్ట్రానికి చేరుకోనున్నారు.

### నిర్మాణాలకు స్థలం కేటాయించండి

- కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక



ఎంపీ సప్తగిరి ఉలక

రాయగడ: పట్టణంలోని జైపూర్ షుగర్ కంపెనీకి చెందిన సుమారు 604 ఎకరాల స్థలాన్ని జిల్లా యంత్రాంగం ఇటీవల హస్తగతం చేసుకున్న నేపథ్యంలో ఆయా స్థలంలో ప్రజలకు వినియోగపడే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రాయగడలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు గత కొన్నాళ్లుగా డిమాండ్ ఉన్నప్పటికీ స్థలాభావ సమస్యతో ప్రభుత్వం వైద్య కళాశాల ఏర్పాటుకు విముఖత చూపిస్తుందన్నారు. ప్రస్తుతం జేఎస్‌కో స్థలం యంత్రాంగం ఆధీనంలో ఉన్న నేపథ్యంలో ఆ స్థలంలో కొంతమేర మెడికల్ కళాశాల కోసం కేటాయించాలని కోరారు. అదే విధంగా పట్టణంలో ట్రైబల్ మ్యూజియం, హాకీ ఇన్‌డోర్ మైదానం ఏర్పాటు ఎంతో అవసరమని, దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని పేర్కొన్నారు.

### అర్హులను జాబితాలో చేర్పించండి

- వెనుకబడిన తరగతుల రాష్ట్రశాఖ పరిశీలకుడు వీరేంద్ర



సర్వేలో పాల్గొన్న వీరేంద్ర, ఇతర అధికారులు

రాయగడ: అర్హులైన ప్రతి ఒక్కరినీ వెనుకబడిన జాబితాలో చేర్పించి, సరైన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆశాఖ రాష్ట్ర పరిశీలకుడు వీరేంద్ర కొరకొర అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రామనగుడ, గుణుపూర్, కొలనార, రాయగడ తదితర ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న వెనుకబడిన గణంకాల సర్వే కార్యక్రమాలు, కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. ఈనెల 1నుంచి ప్రారంభించిన ఈ ప్రక్రియ మే 27తో ముగుస్తున్న నేపథ్యంలో అర్హులైన వారందరినీ జాబితాలో చేర్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశీలకునితో పాటు జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ధర్మానంద బెహరా, రాయగడ బీడీఓ లక్ష్మీనారాయణ సాబతొ, కొలనార బీడీఓ గౌరచంద్ర పట్నాయక్, గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్‌కుమార్ కుహారొ, జిల్లా సామాజిక సురక్షా అధికారి అశోక్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ ప్రశాంతం

- ఝార్సుగూడ ఉప ఎన్నికలో 68.12శాతం ఓటింగ్ నమోదు
- 253పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసిన అధికారులు
- ఓటర్లను ఆకర్షించేలా పింక్ బూత్‌లు, సెల్ఫీ పాయింట్లు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సీఈఓ, అధికారుల బృందం






మీడియాతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి కుంజ బిహారీ ధొలా

భువనేశ్వర్: ఝార్సుగుడ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ సకాలంలో ప్రారంభమైంది. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు నిరవధికంగా కొనసాగింది. మధ్యాహ్నం 3 గంటలకు 55.20శాతం పోలింగ్ నమోదైంది. కేంద్రాల ప్రాంగణాల్లో చందన పుష్పాలతో ఓటర్లకు స్వాగతం పలికారు. తొలిసారిగా ఓటు వేసే హక్కు పొందిన యువతలో కొత్త ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. ప్రతి బూత్‌లోనూ ఓటర్లు తమ ఓటు హక్కును సునాయాసంగా వినియోగించుకునేందుకు సకల ఏర్పాట్లు చేశారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక బూత్‌లు, మహిళల కోసం పింక్ బూత్‌లు కేటాయించారు. మరోవైపు 3 ప్రధాన రాజకీయ పార్టీలైన బిజూ జనతాదళ్(బీజేడీ), భారతీయ జనతాపార్టీ(బీజేపీ), కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు మొత్తం 9మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 2,21,719 మంది ఓటర్లు వీరి భవితవ్యాన్ని నిర్ధారించనున్నారు. బీజేడీ నుంచి దీపాలిదాస్, బీజేపీ నుంచి టొంకొధొరొ త్రిపాఠి, కాంగ్రెస్ నుంచి తరుణ్‌పాండే మధ్యే ప్రధాన పోరు ఉంటుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**వయోవృద్ధుల కోసం..**

ఝార్సుగుడ మున్సిపల్ కౌన్సిల్‌తో పాటు ఝార్సుగుడ, కొలబిర, లయికెర, కిరిమిరా మండలాల్లో ఓటు వేసేందుకు మొత్తం 253 బూత్‌లను ఏర్పాటు చేశారు. వడదెబ్బ నివారణకు ఆదర్శ, పింక్ బూత్‌లలో ఓటర్లకు స్క్వాష్ వాటర్, సర్బత్, పుచ్చకాయలు వంటి శీతల పానీయాలతో తరచూ చన్నీటి పిచికారీ(స్ప్రే) సదుపాయం కూడా ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి రాలేని 321మంది వయోవృద్ధుల ఇళ్ల నుంచి పోస్టల్ బ్యాలెట్ల ద్వారా ఓట్లను స్వీకరించారు. దివ్యాంగ ఓటర్ల కోసం బూత్‌లలో చక్రాల కుర్చీలు ఏర్పాటు చేయడంతో పాటు వీరి రవాణా కోసం జిల్లా యంత్రాంగం వందకు పైగా ఆటోలను కూడా ఏర్పాటు చేసింది. ఓటర్లను ఆకర్షించేందుకు పోలింగ్ బూత్‌ల చుట్టూ సెల్ఫీ పాయింట్లు కూడా నెలకొల్పారు. గుజరాతీ కాలనీ బూత్‌లో బీజేపీ అభ్యర్థి టొంకొధొరొ త్రిపాఠి ఓటు వేయగా, ఆయన భార్య కూడా అక్కడే ఓటు వేశారు.

**నిరంతర నిఘా..**

ఝార్సుగుడ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రక్రియ నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ప్రధానంగా పోలింగ్ కేంద్రాల్లో ప్రక్రియ ఆద్యంతాలను ఈ యంత్రాంగం క్షుణ్ణంగా పర్యవేక్షించేందుకు అనుబంధ ఏర్పాట్లు చేసింది. ప్రతి పోలింగ్ బూత్‌లో ఓటింగ్ సంబంధిత కార్యకలాపాలపై ప్రత్యక్ష పర్యవేక్షణ, నియంత్రణ వర్చువల్‌గా నిర్వహించడం విశేషం. ఈ ప్రక్రియను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనుబంధ అధికారులతో ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు చేపట్టడం తథ్యమని ఈ యంత్రాంగం అనుక్షణం హెచ్చరిస్తోంది.



పోలింగ్ కేంద్రం ముందు ఓటరుకు సంప్రదాయ రీతిలో స్వాగతం పలుకుతున్న వలంటీర్లు




ఓటు వేసిన అనంతరం బీజేడీ అభ్యర్థి దీపాలి దాస్



వడదెబ్బ నివారణకు కేంద్రాల వద్ద నీటిని స్ప్రే చేస్తున్న దృశ్యం




పోలింగ్ కేంద్రంలో ఏర్పాటైన సెల్ఫీ పాయింట్

### సాయంత్ర 5గంటల వరకు..

ఝార్సుగుడ నియోజకవర్గ ఉప ఎన్నికలో ఎలాంటి ఉల్లంఘనలు, హింసాత్మక సంఘటనలు లేనట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) నికుంజ బిహారీ ధొలా తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పురస్కరించుకుని ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు 68.12శాతం ఓటింగ్ నమోదైంది. పోలింగ్ సంతృప్తికరంగా సాగినట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయని వివరించారు. తుది పోలింగ్ శాతం సమగ్ర వివరాలు గురువారం ఉదయం వెల్లడించనున్నట్లు వివరించారు.



వేలికి సిరా గుర్తు చూపిస్తున్న బీజేపీ అభ్యర్థి టొంకొధొరొ త్రిపాఠి



కేంద్రం ఆవరణలో ఓటర్లకు చల్లదనం కోసం సర్బత్, పుచ్చకాయ

# డిమాండ్ల సాధనకు కార్యాలయం ముట్టడి



ఆందోళన నిర్వహిస్తున్న ఉద్యోగులు

జయపురం: వివిధ డిమాండ్ల సాధనకు జయపురం టాటా పవర్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సంస్థ ఉద్యోగులు బుధవారం ముట్టడించారు. డిమాండ్లను పరిష్కరించే వరకు నల్ల రిబ్బన్లు ధరించి, నిరసన కొనసాగిస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఎంతోకాలంగా పనిచేస్తున్న రెగ్యులర్ చేయలేదని, గత ఆగస్టులో రాత పరీక్షలు, జనవరిలో ఇంటర్వ్యూ పూర్తయినా ఇప్పటికీ ఫలితాలు వెల్లడించలేదన్నారు. వెంటనే ఫలితాలు వెల్లడించి, ఉత్తీర్ణులైన వారిని ఉద్యోగాలలో నియమించాలని కోరారు. ఉద్యోగులకు 2020 ఏప్రిల్ 1నుంచి నూతన వేతనం విధానం వర్తింపజేయాలన్నారు. కొత్తగా నియమితులైన ఉద్యోగులను పాత ఉద్యోగులతో సమానంగా గుర్తించాలని, ఇంతవరకు ఖాళీగా ఉన్న పదవులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఉద్యోగులు గోపినాథ్ సాహు, పి.బాలాజీ, మనోజ్ పాణిగ్రాహి, ఆశిష్ త్రిపాఠి, ఎస్‌కే అక్బర్, మఖరధ్వజ శత్పతి, ఝుగల్ నాయక్, శశిభూషణ నాయక్, మనోజ్‌కుమార్ పండా తదితరులు పాల్గొన్నారు.


# చిత్రీకరణకు సన్నద్ధం..



ఎర్రచందనం దుంగలను చిత్రీకరణ ప్రాంతానికి తరలిస్తున్న దృశ్యం

- పొల్లేరు పరిసరాల్లో పుష్ప2 చిత్రీకరణ ప్రారంభం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మన్యం కొండ పంచాయతీ పొల్లేరు గ్రామం, సీలేరు నదీ పరీవాహక ప్రాంతాల్లో తెలుగు చిత్రం పుష్ప2 షూటింగ్‌కు ఏర్పాట్లు మొదలయ్యాయి. దీని కోసం నకిలీ ఎర్రచందనం దుంగలు సిద్ధం చేశారు. మంగళ, బుధవారాల్లో ఈ పనులు పూర్తి చేశారు. అలాగే మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో భద్రతా చర్యల్లో భాగంగా 2ప్లాటూన్ల పోలీసు బలగాలను మొహరించారు. షూటింగ్‌లో భాగంగా జూనియర్ ఆర్టిస్టులతో ఎర్రచందనం దొంగతనం చేసే సన్నివేశాలను చిత్రీకరించారు. మేకప్ వ్యాన్లు, అంబులెన్స్‌లు, దొంగరవాణా కోసం ఈ ప్రాంతంలో రిహార్సల్స్ చేస్తున్నారు.



జూనియర్ ఆర్టిస్టులతో సాగుతున్న చిత్రీకరణ

# సహకార సంఘాలను బలోపేతం చేయాలి

- కేసీసీబీ ఛైర్మన్ ఈశ్వరచంద్ర పాణిగ్రాహి




ఉత్తమ అధికారులను సన్మానిస్తున్న కేసీసీబీ ఛైర్మన్ ఈశ్వరచంద్ర పాణిగ్రాహి



సమీక్షలో పాల్గొన్న బ్యాంక్, ల్యాంపుల మేనేజర్లు

జయపురం: కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్(కేసీసీబీ) కార్యకలాపాల్లో భాగంగా జిల్లా స్థాయి సమీక్ష సమావేశం బుధవారం జరిగింది. జయపురం లోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఛైర్మన్ ఈశ్వరచంద్ర పాణిగ్రాహి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరాపుట్ జిల్లాలో సహకార సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన రుణాలు అందించి, వారి ఉన్నతికి బ్యాంక్ అధికారులు, ల్యాంపు పరిచాలకులు, డైరెక్టర్లు, మేనేజర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రప్రభుత్వం అన్నదాతల సహాయం, సంక్షేమం, ఉన్నతి కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు లబ్ధిదారులకు చేరేలా చూడాలన్నారు. సహకార ఉద్యమంలో క్షేత్రస్థాయి నుంచే రైతులతో మమేకం కావాలని తెలిపారు. సమావేశంలో సీనియర్ డైరెక్టర్ రమాకాంత రౌళొ, జగన్నాథ్ ముదులి, బ్యాంక్ కార్యదర్శి కృష్ణచంద్ర ధానే, సీనియర్ అధికారి హరిహర త్రిపాఠి, అరుణకుమార్ సాహు, వివిధ శాఖల మేనేజర్లు, ల్యాంపు సిబ్బంది పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఖరీఫ్ సీజన్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన సిమిలిగుడ బ్రాంచ్ మేనేజర్ సురేంద్రనాథ్ నాయక్, పొట్టంగి ల్యాంపు కార్యనిర్వాహక డైరెక్టర్ దిగంబర నాయక్, బొరిగుమ్మ ఇన్‌చార్జి డైరెక్టర్ పి.హరిప్రసాదరావు, బ్రాంచ్ మేనేజర్ మనోజ్‌కుమార్ దాస్ లను సన్మానించి, బహుమతులు అందజేశారు.

# కూతకు సిద్ధంగా.. 'వందేభారత్'!

- ఈనెల 15న లాంఛనంగా ప్రారంభించే అవకాశాలు
- హౌరా–పూరీ మధ్య సేవలందించనున్న సెమీ హైస్పీడ్ రైలు



వందేభారత్ సెమీ హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైలు

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుసేవలు అందుబాటులోకి రానుంది. తొలుత హౌరా–పూరీ మార్గంలో రైలు నడిపించేందుకు రైల్వేశాఖ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ సెమీ హైస్పీడ్ రైలును ఈనెల 15న అధికారికంగా ప్రారంభించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ కావాల్సి ఉంది. పూర్తిస్థాయి సేవలను ప్రవేశపెట్టే ముందు ట్రయల్ రన్ ప్రక్రియ విజయవంతమైంది. హౌరా–పూరీ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రయల్ రన్ ఏప్రిల్ 28న పూర్తయ్యింది. ట్రయల్ రన్ సమయంలో పూరీ–హౌరా మధ్య ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్–కెంజొహర్ రోడ్, కటక్, భువనేశ్వర్, ఖుర్దారోడ్ రైల్వే స్టేషన్లలో రెండు నిమిషాలు చొప్పున ఆగింది. ఈ రెండు స్టేషన్ల మధ్య అతి తక్కువ స్టాప్‌లతో సెమీ హైస్పీడ్‌తో పరుగులు తీయడంతో ప్రయాణ సమయం భారీగా తగ్గనుందని రైల్వేవర్గాలు తెలిపాయి.

**వారంలో 3రోజులు..**

రైలు ప్రారంభం సందర్భంగా పూరీ రైల్వే స్టేషన్‌లో రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రత్యక్షంగా హాజరై, జెండా ఊపి తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించనున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొని వందే భారత్ సేవలను జాతికి అంకితం చేయనున్నట్లు సమాచారం. కొత్త రైలులో ఛైర్‌కార్, ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లు రెండు వర్గాలుగా మొత్తం 14 బోగీలు ఉంటాయి. పూరీ–హౌరా మధ్య వారానికి మూడు రోజులు(సోమ, శుక్ర, శని) నడిపించేందుకు యోచిస్తున్నారు. ఈ మేరకు తుది నిర్ణయం ఖరారు కావాల్సి ఉంది. ఖరగ్‌పూర్, భద్రక్, బాలాసోర్, కటక్, భువనేశ్వర్, ఖుర్దారోడ్ రైల్వే స్టేషన్లలో పరిమిత సమయం మాత్రమే ఆగుతుంది. పొరుగు రాష్ట్రం పశ్చిమబెంగాల్ నుంచి జగన్నాథుని దర్శనం కోసం పూరీకి విచ్చేసే యాత్రికులు, పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉంటుంది. రాష్ట్రంలో ఇది మొదటి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కాగా.. భువనేశ్వర్–హైదరాబాద్, పూరీ– రాయ్‌పూర్ మార్గాల్లో మరో సెమీ హైస్పీడ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టాలని రాష్ట్రప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు రాష్ట్ర రవాణా, వాణిజ్యశాఖ మంత్రి రైల్వేశాఖకు లేఖ రాసిన విషయం తెలిసిందే.

## క్లుప్తంగా

### బాల్య వివాహం అడ్డగింత



పెళ్లివారికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ వియ్యంపేట ప్రాజెక్టు సీడీపీఓ ఆర్.ఉమాదేవి ఆధ్వర్యంలో అధికారులు బుధవారం అడ్డుకున్నారు. గ్రామంలో తక్కువ వయస్సు గల అమ్మాయికి పెళ్లి జరుగుతోందని సమాచారం అందడంతో ఎస్సై బి.దేవి, ఈఓపీఆర్డీ ధర్మారావు తదితర అధికారులతో పెళ్లివారి ఇంటికి ఆమె వెళ్లారు. అమ్మయికి సంబంధించిన వయస్సు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించగా 10వ తరగతి సర్టిఫికెట్ కలర్ జిరాక్స్‌ను తల్లిదండ్రులు అధికారులకు చూపారు. ఆ సర్టిఫికెట్‌ను సంబంధిత పాఠశాలలో పరిశీలించగా తప్పుడు పుట్టిన రోజు వేసి కలర్ జిరాక్స్ తీసినట్లు అధికారులు గుర్తించి పెళ్లిని ఆపాలని చూచించారు. మరో ఏడాది పోయిన తరువాతే పెళ్లి జరిపించాలని కుటుంబసభ్యులకు హితవు పలికారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ పెళ్లి గురువారం తెల్లవారుజామున జరగాల్సి ఉంది. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

### రాములోరి హుండీ ఆదాయం రూ.24 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామివారి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఈ మేరకు మూడు నెలలకు గానూ దేవస్థానంలో ఉన్న హుండీల ద్వారా రూ.24,64,540 ఆదాయం లభించిందని ఈఓ కిశోర్ కుమార్ తెలిపారు. లభించిన ఆదాయాన్ని దేవస్థాన ఏపీజీవీబీ ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. సహాయ కమిషనర్ ప్రసాదరావు హుండీ లెక్కింపును దగ్గరుండి పర్యవేక్షించారు. పలు ప్రాంతాలకు చెందిన స్వామి సేవా భక్తులు ఆదాయాన్ని లెక్కించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

### ప్రత్యేక తరగతులపై దృష్టి సారించాలి

- డీఈఓ లింగేశ్వర రెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వర రెడ్డి

బొబ్బిలి: పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల పట్ల హెచ్‌ఎంలు దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వర రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ట్రిపుల్‌ఎస్ డిగ్రీ కాలేజ్‌లో డివిజన్‌లోని అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చూడడం, వారు ఏఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి వాటిపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. అలాగే నాడు నేడు పనుల పూర్తికి ఆయా కాంట్రాక్టర్లను త్వరితగతిన సంసిద్ధం చేయాలని ఆదేశించారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు వెంటనే రంగంలోకి దిగాలని సూచించారు. ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

### కారు, బైక్ ఢీ: ముగ్గురికి గాయాలు

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి26పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి గజపతినగరం వస్తున్న కారు బోడసింగిపేట గ్రామం జంక్షన్‌లో రోడ్డుదాటుతున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న గురుబిల్లి ఉదయ్ కుమార్, బోడసింగి శ్రీనుతో పాటు మరొకరు గాయపడ్డారు. క్షతగాత్రులను గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఛెలిగడ పనులు చకచకా..

- ప్రాజెక్టు పనులు పరిశీలించిన 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్
- రూ.936 కోట్లు రాష్ట్రప్రభుత్వం వెచ్చిస్తున్నట్ల ప్రకటన



జిరంగో బౌద్ధ మందిరంలో పాండ్యన్‌తో బౌద్ధ సన్యాసులు

పర్లాకిమిడి: గంజాం, గజపతి జిల్లాలకు తాగు, సాగునీరు అందించే బృహత్తర చెలిగడ ప్రాజెక్టును త్వరలో ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర 5టీ కార్యదర్శి వి.కార్తికేయ పాండ్యన్ వెల్లడించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన ఛెలిగడ, గుమ్మా, పర్లాకిమిడిలో ప్రాంతాల్లో బుధవారం పర్యటించి, వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆర్.ఉదయగిరి బ్లాక్ ఛెలిగడ గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న చెలిగడ ప్రాజెక్టు ద్వారా గంజాం జిల్లాలో 5,760 హెక్టార్లు, గజపతి జిల్లాలో 500 హెక్టార్ల భూములకు సాగునీరు, బరంపురం ప్రజలకు తాగునీరు అందించేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.936.63 కోట్లు వెచ్చిందని తెలిపారు. పర్లాకిమిడిలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.40కోట్లు ఖర్చు అవుతుందన్నారు. అనంతరం బెత్తగుడ వద్ద నిర్మాణంలో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ భవనాన్ని తనిఖీ చేశారు. రూ.6.5 కోట్లతో బెత్తగుడ రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న కొత్త టౌన్ హాలు భవనాన్ని పర్యవేక్షించారు. అలాగే జిల్లాలోని శాయ్యాలిలొట్టి, కనకత, డెక్కిలి గ్రామాల్లో మినీ హైడెల్ ప్రాజెక్టులు, 36 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరిగే పథకాలను సీఎం నవీన్ పట్నాయక్‌తో మాట్లాడి, ఆమోదానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**15రోజుల్లో సిద్ధం చేయాలి..**

పర్లాకిమిడికి బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.40 కోట్లు ఖర్చు పెట్టేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని, ఈ పనులు అతి త్వరలో ప్రారంభించేందుకు రోడ్లు, భవనాలశాఖ ఎస్ఈకి ఆదేశించారు. బెత్తగుడ వద్ద కొత్త టౌన్ హాలు, సాంస్కృతిక భవనానికి రూ.5 కోట్లు మంజూరు చేశామన్నారు. చివరిగా పాండ్యన్ పర్లాకిమిడి శివార్లలో ఉన్న రామసాగరం, కృష్ణసాగారం భారీ నీటిపారుదల ప్రాజెక్టు వద్దకు వెళ్లి, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. రామసాగరం పుణరుద్ధరణ, సుందరీకరణకు రూ.10 కోట్లు ఖర్చు అవుతుందని, దీనిపై 15 రోజుల్లోగా డీపీఆర్ సిద్ధం చేయాలని పేర్కొన్నారు. గుసాని సమితి నువాగం గ్రామం వద్ద కృష్ణసాగరం పుణరుద్ధరణ పనులకు రూ.15 కోట్లు అవసరమని సంబంధిత ఇంజినీర్లు తెలిపారు. దీని ద్వారా రైతులకు 2వేల హెక్టార్లకు సాగునీరు అందించవచ్చని వివరించారు. అనంతరం పర్లాకిమిడి బెత్తగుడ చేరుకున్న పాండ్యన్.. ప్రత్యేక హెలీకాప్టర్‌లో భువనేశ్వర్ బయలుదేరారు.



ఛెలిగడ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న పాండ్యన్



గుమ్మాలో మిషన్‌శక్తి మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు పరిశీలిస్తున్న దృశ్యం



గుమ్మాలో జరిగిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు

### బౌద్ధ మందిరంలో పూజలు..

బరంపురం: గజపతి జిల్లాలో జిరంగాలో ఉన్న బౌద్ధ మందిరాన్ని 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్ దర్శించుకున్నారు. మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి బౌద్ధ సన్యాసులతో మేమకమై, వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు.



జిరంగా బౌద్ధ మందిరంలో పూజలు చేస్తున్న వీకే పాండ్యన్

### లక్ష్యానికి మించి అటవీ ఉత్పత్తుల కోనుగోలు

- జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్ర

పార్వతీపురం టౌన్: గిరిజన ప్రాంతంలో జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తులు కొనుగోలు వేగవంతం చేస్తున్నట్లు జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్ర తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక జీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో చింతపండు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు ముమ్మరం చేశామని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం రూ. 4.30 కోట్లు కాగా లక్ష్యానికి మించి రూ.10.35 కోట్ల విలువగల ఉత్పత్తులను కొనుగోలు చేశామని చెప్పారు. గ్రేడ్-1 రకం చింతపండు రూ.32.40కు కొనుగోలు చేస్తున్నామన్నారు. పిక్క తీసిన చింతపండు రూ.65కు మిగిలిన అన్ని రకాల అటవీ ఉత్పత్తుల కొనుగోలు కోసం ఇటీవల నిధులను మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర ద్వారా సమస్యలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో రైతులు నాణ్యమైన చింతపండు, జీడిపిక్కలు, ఇండుగ పిక్కలు, కరక్కాయ, కొండతామర జిగురు, కొండచీపుళ్ల, తేనె తీసుకుని వచ్చి జీసీసీ నిర్వహించిన గిట్టుబాటు ధరలు పొందాలని కోరారు.

### ఆటో ఢీకొని యాత్రికుడి మృతి

వీరఘట్టం: మండలంలోని సీఎస్‌పీ రహదారి మరియగిరి సమీపంలో చీపురుపల్లి మండలం బాతువ గ్రామానికి ధనుకోటి జోగినాయుడు(43) మృతిచెందాడు. వీరఘట్టంలో జరుగుతున్న గ్రామదేవత పండగకు బంధువుల ఇంటికి బావమరిది రెడ్డి పైడిరాజుతో కలిసి జోగినాయుడు బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో పండగ సంబరాలు ముగించుకుని ఓ కుటుంబం ఆటోలో వెళ్తోంది. ఎదురుగా వస్తున్న ఆటోను బైక్‌పై వస్తున్న జోగినాయుడు ఢీ కొట్టాడు. అదే సమయంలో వెనుకగా వస్తున్న మరో బైక్ కూడా వీరి బైక్‌ను బలంగా ఢీ కొట్టడంతో జోగినాయుడు, పైడిరాజులు రోడ్డుపై పడి గాయాలపాలయ్యారు. వారిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే జోగినాయుడు చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. గాయాలపాలైన పైడిరాజుకు చికిత్స అందజేశారు.

### తేనేటీగల దాడిలో 18 మందికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం





గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సింగారి పంచాయతీ కరంజి గ్రామంలో తేనేటీగల దాడిలో 18మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే... కరంజి గ్రామంలోని హరిజన వీధిలో 3రోజుల క్రితం అమ్మవారి జాతర నిర్వహించారు. బుధవారం అనుపోత్సవంలో భాగంగా వీధిలోని వారంతా సమీపంలోని ఉన్న కల్యాణి నదికి వెళ్లారు. ఈ క్రమంలో సమీపంలోని మామిడి చెట్టుకు ఉన్న తేనేటీగల పొద చెదిరి అందరినీ గాయపరిచింది. బాధితుల్లో సుభాష్ చకిరి(21), రోషేయి మహానందియా( 20), రమేష్ టకిరి(25), ఘాసీరాం మహానందియా(45), ప్రేమ్ కొంధొపాణి(22), సురజ్ మహానందియా(38), బిబిన్ కౌసల్యా(50), తనసి మహానందియా(35), పూర్ణొచంద్ర మహానందియా(34), బద్దైన బాగ్(7), సునయాన బాగ్(35), మానిఖ్యరావు కౌసల్య(55), హరి భొత్ర(60), ధొబుని కౌసల్య(22) ఉన్నారు. వీరిలో బద్దైనా బాగ్, రమేష్ టకిరి పరిస్థతి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. వీరంతా కల్యాణ సింగుపూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు.

### ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొని వ్యక్తి మృతి

పూసపాటిరేగ: మండలంలోని గైతులచోడవరం సమీపంలో ఆగి వున్న వ్యాన్‌ను మోటార్‌సైకిల్ ఢీకొనడంతో కొవ్వాడ గ్రామానికి చెందిన చింతపల్లి సూర్యనారాయణ (45) మృతి చెందాడు. అరబిందో పరిశ్రమలో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సూర్యనారాయణ విధులు ముగించుకుని మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తుండగా గైతులచోడవరం సమీపంలో జాతీయరహదారిపై ఆగి ఉన్న వ్యాన్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. గాయపడిన వ్యక్తిని విజయనగరంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

### నా భూమి ఇప్పించండి

- కలెక్టర్‌కు వేడుకోలు

పార్వతీపురం: తన భూమి తనకు ఇప్పించాలని పార్వతీపురం మండలంలోని రేపటివలస గ్రామానికి చెందిన జన్ని సింహాచలం కలెక్టర్ నిషాంత్ కుమార్‌ను కోరాడు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను కలిసి అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం కింద తనకు భూమి కేటాయించగా ప్రస్తుతం అందులో జీడితోట సాగు చేస్తున్నామని తెలిపాడు. అయితే గ్రామానికి చెందిన యాండ్రాపు బలరాం, ఎం.రాములు బలవంతంగా తన భూమిని ఆక్రమించుకునేందుకు చూస్తున్నారని రెండేళ్లుగా జీడితోట ఫలసాయాన్ని తీసుకుంటున్నారని ఆరోపించాడు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్‌లో అర్జీని నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఏఓ ఉమా మహేశ్వరరావును ఆదేశించారు.

### బాలికను గర్భవతిని చేసిన యువకుడు



నిందితుడు అచ్చిబాబు తల్లిని విచారిస్తున్న సీడీపీఓ ఎస్తేరు రాణి, వివిధ శాఖల అధికారులు

భోగాపురం: మండలంలోని సవరవిల్లి గ్రామానికి చెందిన బోర అచ్చిబాబు(25) అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో లొంగదీసుకుని 3 నెలలు గర్భవతిని చేశాడు. అంతేకాకుండా ఎవరికి తెలియకుండా పెళ్లి చేసుకునేందుకు సిద్ధపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఏపీ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కేశలి అప్పారావు తక్షణమే స్పందించి బాలిక తల్లిదండ్రులు, అచ్చిబాబును విచారించి, నిందితుడిపై తగుచర్యలు తీసకుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్తేరు రాణిని ఫోన్ ద్వారా ఆదేశించారు. దీంతో ఆమె ఏఎస్సై అప్పారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిశోర్, వీఆర్వో రామారావులతో కలిసి బుధవారం సాయంత్రం సవరవిల్లి గ్రామానికి చేరుకుని అచ్చిబాబు, బాలిక ఇళ్లకు వెళ్లి వారి తల్లులను విచారణ చేశారు. ఈ విచారణలో బాలికను అచ్చిబాబు గర్భవతిని చేసినట్లు తేలింది. గర్భవతి అయిన బాలికను విజయనగరంలోని స్వధార్ హోమ్‌కి తరలించాల్సి ఉండగా తరలించకుండా తమ కూమార్తెకు బాల్య వివాహం చేయబోమని రెవెన్యూ, పోలీసుశాఖ అధ్వర్యంలో వధువు తల్లి నుంచి అంగీకార పత్రం తీసుకుని సీడీపీఓ ఎస్తేరు రాణి అక్కడి నుంచి వెనుదిరిగారు. విచారణలో ఏఎన్ఎం, ఆశ వర్కర్, అంగన్‌వాడీ కార్యకర్త, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మన్యంలో .. చిరుధాన్యాల సిరి

- పెరిగిన చిరుధాన్యాల సాగు
- ప్రభుత్వ ప్రోత్సాహం
- రాయితీపై విత్తనాలు
- ఏడాదిపొడవునా అవగాహన కార్యక్రమాలు
- మద్దతు ధరకు పంట కొనుగోలు
- పార్వతీపురం మన్యం జిల్లాలో 6,399 ఎకరాల్లో సాగు



చింతలగూడ కారెం ఏరియాలో పండిన కొర్ర పంట

సీతంపేట: చిరుధాన్యాలు.. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వంచే పంటలు. వాతావరణ పరిస్థితులను తట్టుకుంటాయి. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగం లేకుండా చేతికొస్తాయి. వీటిలో పోషకాలు అధికం. ఒకప్పుడు పేదలు, మధ్య తరగతి ప్రజల ప్రధాన ఆహారం. మూడు దశాబ్దాల కిందటి వరకు వీటి వినియోగం అధికంగా ఉండేది. ఈ పంటలను వందశాతం పశువుల ఎరువు, చెరువు మట్టి, ఇతర సేంద్రియ ఎరువులతోనే భూమిని సారవంతం చేసి రైతులు పంట పండించే వారు. ఫలితంగా ఆరోగ్యకర పంటలు చేతికందేవి. మారిన కాలంతో పాటు ప్రజల జీవన విధానంలో మార్పువచ్చింది. చిరుధాన్యాల వినియోగం తగ్గింది. గిట్టుబాటు ధరలేకపోవడంతో రైతులు కూడా పంట సాగువిస్తీర్ణం క్రమేపీ తగ్గిస్తూ వచ్చారు. ప్రస్తుతం చాలా ఆరోగ్య సమస్యలకు రసాయనిక ఎరువులతో పండించిన పంటలే కారణమని వైద్యవర్గాలు స్పష్టం చేయడం... చిరుధాన్యాలు తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ఆరోగ్యం సిద్ధిస్తుందని పదేపదే చెబుతుండడంతో ప్రభుత్వాలు కూడా ఆలోచనలో పడ్డాయి. చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నాయి. రాయితీలు ఇస్తున్నాయి. మద్దతు ధరను కల్పిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించి, సాగు ఆవశ్యకతను తెలియజేసింది. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ అధికారుల ప్రోత్సాహంతో పార్వతీపురం మన్యం జిల్లా రైతులు మళ్లీ చిరుధాన్యాల సాగుపై మక్కువ చూపుతున్నారు. అధిక విస్తీర్ణంలో సాగుచేసి ఆదాయం ఆర్జిస్తున్నారు.

**మద్దతు ధర ఇలా..**

కొర్ర పంటకు ప్రభుత్వం క్వింటా రూ.2,500లు ప్రకటించింది. అదేవిధంగా జొన్నలు రూ.2,990, సజ్జలు రూ.2,350, రాగులు క్వింటా రూ.3,578లుగా నిర్ధారించింది. రైతుల నుంచి గిట్టుబాటు ధరకు పంట కొనుగోలు చేస్తోంది.



చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**మన్యంలో చిరుధాన్యాల సాగు ఇలా...**

| మండలం | రైతులు | విస్తీర్ణం (ఎకరాల్లో) |
|---|---|---|
| సీతంపేట | 168 | 96.60 |
| వీరఘట్టం | 156 | 114.50 |
| బామిని | 56 | 38.50 |
| గుమ్మలక్ష్మీపురం | 4020 | 3,348.75 |
| కురుపాం | 2,326 | 1872.50 |
| సాలురు | 1242 | 928.50 |
| మొత్తం | 7,968 | 6,399.35 |

**తక్కువ వ్యవధిలోనే పంట చేతికి...**

హైబ్రిడ్ విత్తనాల పంటల కంటే తక్కువ వ్యవధిలోనే పంట చేతికి వస్తుండడంతో రైతులు చిరుధాన్యాల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం కొన్ని రకాల కొర్ర విత్తన రకాలు 80 నుంచి 100 రోజులలోగా పంట చేతికొస్తుంది. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. పెట్టుబడి పోనూ రైతులకు దాదాపు రూ.20 వేలకు పైగా లాభం వచ్చే అవకాశం ఉంది.

#### మన్యం అనుకూలం



మిల్లెట్స్ సాగుకు మన్యం అనుకూలం. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నాం. చిరుధాన్యాల పంటలను ప్రోత్సాహిస్తున్నాం. ఆర్‌బీకేల స్థాయిలో రైతులకు ఎప్పటికప్పుడు సాగు పద్ధతులను వివరిస్తున్నాం. చిరుధాన్యాల పంటలే ప్రదర్శన క్షేత్రాలుగా ఏర్పాటు చేస్తున్నాం.

– పి.షన్ముకరాజు, డీపీఎం, ప్రకృతివ్యవసాయం

#### అధిక దిగుబడి



ఈ ఏడాది రబీ సీజన్‌లో చిరుధాన్యాలు పంటలు కలిసివచ్చాయి. అధిక దిగుబడులు వస్తున్నాయి. ఎరువులు వేయకుండా పండించిన పంటలు ఇవి. ఆరోగ్యకరం. మన్యంలో సాగుచేసిన చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

– సింహబలుడు, మాస్టర్ ట్రైనర్

#### సాగుకు ప్రోత్సాహం



నేను 4 ఎకరాల్లో కొర్రలు పండించాను. చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం అందుతోంది. సంభందిత అధికారులు ఎప్పటికప్పుడు సూచలను సలహాలు ఇస్తున్నారు. రాయితీపై విత్తనాలు అందిస్తున్నారు. పూర్వం పండించే పంటలను ఇప్పుడు మళ్లీ పండిస్తున్నాం. దిగుబడి, ధర బాగుంది. ఆదాయం వస్తోంది.

– సవర జమ్మయ్య, రైతు, కారెం చింతలగూడ

### ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ పెంపు

- 16 శాతానికి పెంచడం హర్షణీయం
- ఏపీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిశోర్



ఏపీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిశోర్ కుమార్

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం అందిస్తున్న 12 శాతం హెచ్‌ఆర్‌ఏను ప్రభుత్వం 16 శాతానికి పెంచడం హర్షణీయమని ఏపీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిశోర్ అన్నారు. పార్వతీపురంలోని ఎన్‌జీఓ సంఘం కార్యాలయంలో సాక్షినిక విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడారు. పార్వతీపురం జిల్లా కేంద్రంతో పాటు 8 కిలోమీటర్ల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏను పెంచుతూ జీఓ జారీచేయడంపై ఉద్యోగుల తరపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా ఏర్పడిన 13 జిల్లాల్లో జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం నిర్ణయించిన జనాభా సంఖ్య లేనప్పటికీ, ఉద్యోగుల ఇబ్బందుల దృష్ట్యా ఏపీఎన్‌జీఓ సంఘం విన్నపం మేరకు జీఓలను సవరించి అన్ని జిల్లా కేంద్రాలతో సమానంగా కొత్త జిల్లాలకు హెచ్‌ఆర్‌ఏను పెంచుతూ ఉత్తర్వులను జారీ చేయడం విప్లవాత్మక నిర్ణయంగా పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ వస్తున్నారన్నారు. సీపీఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులైజేషన్, రావాల్సిన బకాయిల పట్ల త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల ఆదరణ చూపుతోందని పేర్కొఅన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి జిల్లా ఉపాధ్యాయ సంఘాల తరపున కృతజ్ఞతలను తెలియజేశారు.

## క్లుప్తంగా

### ఆటోబోల్తా పడి ఇద్దరికి గాయాలు


చికిత్స పొందుతున్న లోకేష్

టెక్కలి రూరల్: స్థానిక మెళియాపుట్టి రోడ్డు జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. బుధవారం జరిగిన ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. గొప్పిలి సమీపంలోని జోన్నపల్లి గ్రామానికి చెందిన జి.లోకేష్, బి.కగేష్‌లతో పాటు మరో ముగ్గురు టెక్కలి వైపు ఆటోలో వస్తుండగా జాతీయ రహదారిపై ఏర్పడిన చిన్నగుంతను తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడడంతో ప్రమాదం జరిగింది. లోకేష్, కగేష్ గాయపడగా.. మిగిలిన ముగ్గురు క్షేమంగా బయటపడ్డారు. గాయపడిన ఇరువురిని హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు వివరాలు సమోదు చేశారు.

**వృద్ధుడికి గాయాలు**

ఎల్.ఎన్.పేట: బొర్రంపేట వద్ద అలికాం-బత్తిలి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వలసపాడు గ్రామానికి చెందిన వృద్ధుడు తాలాడ రాములును గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. బుధవారం సాయంత్రం రాములు రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్నాడు. సరుబుజ్జిలి నుంచి హిరమండలం వైపు వస్తున్న వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన రాములును 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

### వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

జి.సిగడాం: మెట్టవలస గ్రామానికి చెందిన వివాహిత పైల లక్ష్మి అదృశ్యంపై కేసు నమోదు చేశామని స్థానిక పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ పాగిరి శంకరరావు బుధవారం తెలిపారు. ఈనెల తొమ్మితో తేదీన తెల్లవారుజాము నాలుగు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె ఇంతవరకు తిరిగి రాలేదని భర్త పైల రాము ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. లక్ష్మికి మతిస్థిమితం లేకపోవడంతో ఎటో వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్టు హెచ్‌సీ చెప్పారు.

### 20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

కంచిలి: బొగాబెణి పంచాయతీ పరిధి జెన్నాగాయి గ్రామానికి చెందిన తురాలి ఢిల్లీశ్వరరావు సారా తరలిస్తూ పట్టుబడినట్టు ఎస్సై ఎస్.చిరంజీవి బుధవారం తెలిపారు. ఇతని వద్ద నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఢిల్లీశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

### 19న బీఆర్‌ఆర్ శత జయంతి ఉత్సవాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: బొడ్డేపల్లి రాజగోపాలరావు (బీఆర్‌ఆర్) శత జయంతి ఉత్సవాలను జిల్లాలో నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 19న బీఆర్‌ఆర్ శత జయంతి ఉత్సవాలు ప్రారంభించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శత జయంతి ఉత్సవాలపై బీఆర్‌ఆర్ కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, కలెక్టర్‌తో కలిసి స్పీకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్సవాల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. బి.సి.సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు. అప్పటి నుంచి నిర్వహించే కార్యక్రమాలు, ముగింపు రోజున బహిరంగ సభ తదితర వివరాలతో ముందుకురావాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అతి పెద్ద నీటిపారుదల ప్రాజెక్టు బీఆర్‌ఆర్ పేరుతో ఉందని, ఆ స్థాయిలోనే శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, మాజీ మంత్రి బొడ్డేపల్లి సత్యవతి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, బి.సి.సంక్షేమ శాఖాధికారి ఇ.అనురాధ, బొడ్డేపల్లి గోవింద, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

### అపురూపం.. వాసుదేవుని అలంకారం


దివ్యస్వరూపునిగా దర్శనమిచ్చిన వాసుదేవస్వామి

మందస: వాసుదేవుని దివ్యస్వరూపాన్ని భక్తులు కనులారా తిలకించి భక్తి తన్మయత్వానికి గురయ్యారు. వసంతోత్సవం అనంతరం వేదపండితులు బుధవారం స్వామిని దివ్యాంకృతునికావించారు. ఆనవాయితీగా వస్తున్న ఆభరణాల ధరింపజేశారు. శ్రీవాసుదేవస్వామి దివ్యరూపాన్ని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# ఆరోగ్యమే మహా సంబరం

- జిల్లాల్లో గ్రామదేవత పండగల సీజన్
- ఇతర ప్రాంతాల నుంచి తరలివస్తున్న వేలాది మంది
- మితిమీరి తింటే ఆస్పత్రి పాలే
- బాగా ఉడికిన మాంసాన్ని మాత్రమే తినాలంటున్న వైద్యులు
- జిల్లాలో మొదలైన డయేరియా, ఫుడ్ పాయిజన్ కేసులు
- వేసవి ఉష్ణోగ్రత పెరగడంతో వడదెబ్బ తగిలే అవకాశాలు

జిల్లాలో ఎక్కడ చూసిన గ్రామదేవతల పండగ హడావిడే. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఒక ఎత్తయితే.. అతిథులకు భోజన ఏర్పాట్లు మరొక ఎత్తు. ఇంటికి వచ్చిన ఆడపిల్లలు, చుట్టాలు, బంధువులకు కమ్మని భోజనం ముఖ్యంగా మాంసాహారం పెట్టేందుకు పోటీపడుతుంటారు. వివిధ వెరైటీల్లో చికెన్, మటన్ కర్రీలు కళ్లముందు కనిపించే సరికి ఆవురావురుమని భోంచేస్తుంటారు. ఇక్కడే సంయమనం పాటించాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అసలే ఎండలు.. ఈ పరిస్థితుల్లో అతిగా మాంసాహారం తింటే ఇక్కట్లు తప్పవని హెచ్చరిస్తున్నారు.


మాంసాహారాన్ని తింటున్న జనం

అరసవల్లి:

ఇప్పుడు గ్రామదేవత సంబరాల సీజన్ నడుస్తోంది. మండుటెండల్లో అమ్మవార్లకు చల్లదనాలు చేసేలా అటు ఇచ్ఛాపురం నుంచి ఇటు రణస్థలం వరకు దాదాపుగా అన్ని దిక్కుల్లోనూ వివిధ రూపాల్లో అమ్మవారిని కొలుస్తూ ఉత్సవాలు జరుపుకొంటున్నారు. 12 ఏళ్లకొకసారి, పదేళ్ల తర్వాత అంటూ చాలా చోట్ల ఈ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సంబరాల్లో భాగంగా అన్ని ప్రాంతాల్లోనూ అత్యంత ప్రాధాన్యత మాంసాహార భోజనాలకే అని చెప్పవచ్చు.



మేకలు, కోళ్లను పెద్ద సంఖ్యలో బలి ఇచ్చి..వాటి మాంసాన్ని భుజించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ జిల్లాతో పాటు పొరుగు జిల్లాల్లో కూడా అమ్మవారి సంబరాలు జరుగుతున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన మన జిల్లా వాసులు, ఆయా గ్రామాలకు చెందిన వారు ఇప్పటికే సిక్కోలు చేరుకున్నారు. అయితే ఇష్టానుసారంగా ఆహారాన్ని తీసుకోకుండా ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే ఆస్పత్రుల పాలవుతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికితోడు వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న నేపథ్యంలో కూడా జనం అప్రమత్తంగా ఉండాలని, లేదంటే వడదెబ్బ తగిలే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### అందుబాటులో సిబ్బంది..



జిల్లాలో సంబరాలు జరుగుతున్న ప్రాంతాల్లో ముఖ్యంగా ఇఛ్ఛాపురం, పాతపట్నంలో ప్రత్యేకంగా వైద్య శిబిరాలు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో గ్రామ సచివాలయాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు.

– డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

### నాణ్యమైన ఉత్పత్తులు మేలు..



వంటకు వాడే సరుకులను వీలైనంత వరకు బ్రాండెడ్ కంపెనీలవీ వాడాలి. లూజ్‌గా దొరికే కారం, ఆయిల్స్, మసాలాలు కాకుండా సీలు ప్యాకెట్స్‌గా ఉన్న ఐఎస్‌ఐ, అగ్‌మార్కు ప్రొడక్ట్‌ను మాత్రమే వినియోగించాలి.

– కె.వెంకటరత్నం, జిల్లా ఆహార పరిరక్షక ప్రమాణాల శాఖాధికారి

### ఈ జాగ్రత్తలు తప్పనిసరి..



- మాంసాహార భోజనం విషయంలో అధికంగా తింటే అనర్థాలే. మాంసం బాగా ఉడకాలి. లేదంటే జీర్ణ సమస్యలు, ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉంటుంది.
- మాంసాహారం వంటల్లో అతిగా మసాలా వినియోగించకూడదు. మసాలా ఫుడ్స్ ఎక్కువ తినడంతో డయేరియా వచ్చే ప్రమాదముంది.
- వేసవిలో నాన్‌వెజ్, ఆయిల్ ఫుడ్ అధికంగా తినడం మంచిది కాదు.



- మటన్ హైప్రోటీన్ ఫుడ్ కావడంతో జీర్ణానికి చాలా సమయం తీసుకుంటుంది. పొట్టలో ఇబ్బందులుంటే తినడానికి సాహసించకూడదు.
- ఫుడ్ పాయిజన్ అయితే యాంటిబయాటిక్స్, ఫ్లూయిడ్స్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే జిల్లాలో డయేరియా, ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయి.



- మాంసాహార భోజనాల్లో మటన్ కంటే చికెన్ బె టర్. మటన్‌లో హైప్రోటీన్, హై ఫ్యాటీ ఉంటుంది.
- హృద్రోగులు, ఆర్థో పేషెంట్స్ మాంసాహారం తినడం మంచిది కాదు. 45 ఏళ్లు దాటిన వారు కూడా పలు జాగ్రత్తలు తీసుకోవాలి.



- చేపలు కూడా బాగా ఉడకకుండా పులుసులా వండితే డయేరియా వస్తుంది.
- జన సందోహంతో పాటు వేసవి తీవ్రతతో వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది. అలాగే వైరల్ జ్వరాలు పెరుగుతాయి.
- వడదెబ్బ తగిలితే వెంటనే గాలి బాగా ప్రసరించే ప్రాంతాల్లోకి తీసుకెళ్లాలి. మంచినీరు తాగించాలి. ఒళ్లంతా తడిగుడ్డతో వొత్తాలి..



- ప్రజలంతా ఎప్పటికప్పుడు కొబ్బరి నీరు, మంచినీరు, ఓఆర్‌ఎస్ ద్రావణాలు తాగాలి.
- జాతరల్లో సురక్షిత నీరు.. క్లోరినేషన్ నీటిని మాత్రమే వంటలకు వినియోగించాలి.
- సంబరాల ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు తప్పనిసరి.
- వండిన ఆహారం బాగా ఉడికించాలి. అడుగు భాగం పాడైన అల్యూమినియం పాత్రల్లో వండకూడదు.
- ఆర్వో ప్లాంట్లలో ఉన్న ఐస్‌ను మాత్రమే వినియోగించాలి. బయట ప్రాంతాల్లోని ఐస్‌ను వాడితే వైరస్, బ్యాక్టీరియా రోగాలు వచ్చే అవకాశముంది.

### లక్ష పసుపు కొమ్ములతో అర్చన


పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి బుధవారం లక్ష పసుపు కొమ్ములతో ప్రత్యేక అర్చన నిర్వహించారు. స్థానిక కళింగ కోమటి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. - కాశీబుగ్గ

### తెలంగాణ ఇంటర్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్


పూజారి సిద్విని

ఆమదాలవలస రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఆమదాలవలస మండలం లొద్దలపేటకు చెందిన పూజారి సిద్విని హెచ్‌ఈసీ గ్రూపులో 475 మార్కులకు గానూ 468 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. సిద్విని ఎల్‌బీనగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి ఏపీఎస్‌ఆర్‌టీసీలో ఉద్యోగం చేస్తుండగా, తల్లి ప్రయివేట్ స్కూల్ టీచర్. తల్లిదండ్రులు వృత్తిరీత్యా శ్రీకాకుళం నగరంలో నివాసముంటున్నారు.

# వెంటాడిన మృత్యువు

- మహేంద్ర తనయ నదిలో కూరుకుపోయిన తండ్రీకొడుకులు
- కుమారుడి మృతి, తండ్రి పరిస్థితి విషమం


దున్న ప్రణయ్


గిరిజ తల్లిని ఓదారుస్తున్న బారువ సర్పంచ్ యర్ర రజనీ

సోంపేట : చాలాకాలం తర్వాత స్వగ్రామానికి వచ్చిన ఆ కుటుంబాన్ని విధి పగబట్టింది. ఒక్కగానొక్క కుమారుడ్ని తల్లిదండ్రులకు దూరం చేసి పుత్రశోకం మిగిల్చింది. ఈ విషాద ఘటన సోంపేట మండలంలో బుధవారం చోటుచేసుకుంది. బారువ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బారువ గ్రామానికి చెందిన దున్న చిరంజీవి అండమాన్‌లో వలస కార్మికుడిగా పనిచేస్తున్నాడు. 12 ఏళ్ల కింద దామోదరపురం గ్రామానికి చెందిన గిరిజతో వివాహమైంది. పెళ్లయిన ఐదేళ్లకు కుమారుడు దున్న ప్రణయ్(7) జన్మించాడు. ఇంటి నిర్మాణం, కుటుంబ సభ్యులు, బంధువులతో గడిపేందుకు నెల రోజుల క్రితం చిరంజీవి కుటుంబంతో సహా బారువ చేరుకున్నారు. బుధవారం ఉదయం అత్తవారిల్లు దామోదరపురం వెళ్లేందుకు బస్సు కోసం బారువ బస్టాండుకు వచ్చారు. వీరు వచ్చే సమయానికి బస్సు వెళ్లిపోవడంతో మహేంద్ర తనయ నది గుండా నడిచి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. గ్రామ సమీపంలోకి వచ్చేసరికి నదిలో గోతిలో తండ్రికొడుకులు కూరుకుపోయారు. వెనుకే ఉన్న తల్లి గిరిజ కేకలు వేయడంతో అదే గ్రామానికి చెందిన జి.హేమరాజు వచ్చి చిరంజీవిని, దున్న ప్రణయ్‌ను బయటకు లాగాడు. ఇద్దరు అపస్మారక స్థితికి చేరుకోవడంతో గళ్లూరు సామాజిక ఆస్పత్రికి, అక్కడి నుంచి సోంపేట సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ప్రణయ్ మృతి చెందగా, చిరంజీవి పరిస్థితి విషమంగా మారింది. మెరుగైన వైద్యం కోసం బరంపురం తరలించారు. ప్రణయ్ తల్లి గిరిజ ఫిర్యాదు మేరకు బారువ ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ప్రణయ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# ఉలిక్కిపడిన కోదడ్డపనస

- జంట హత్యలకు పాల్పడిన నిందితుడు ఆత్మహత్య
- వరుస మరణాలతో ఆయా కుటుంబాల్లో విషాదం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

సారవకోట:

ప్రశాంతంగా ఉండే కోదడ్డపనస గ్రామం వరుస హత్యలు, ఆత్మహత్యతో ఉలిక్కిపడింది. వివాహేతర సంబంధం మూడు కుటుంబాల్లో పెను విషాదం నింపింది. గ్రామానికి చెందిన అవివాహితుడైన ముద్దాడ రామారావు(32) అదే గ్రామానికి చెందిన వెలమల ఎర్రమ్మతో ఎనిమిదేళ్ల నుంచి వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తుండటం, ఇటీవల ఎర్రమ్మ అదే గ్రామానికి చెందిన ముద్దాడ సంతోష్‌తో చనువుగా ఉండటంతో మంగళవారం జంట హత్యలు జరిగిన విషయం తెలిసిందే. ఈ దారుణానికి పాల్పడిన రామారావు సైతం గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. రెండు హత్యలు చేసి పొలాల గుండా నడుచుకుంటూ వెళ్లిన రామారావు తొగిరి పంచాయతీ కొమ్మవలస సమీపంలో ఊరచెరువు వద్ద పంట పొలాల్లో తాను హత్యలకు వాడిన కత్తితోనే గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం నిందితుడిని సెల్‌సిగ్నల్స్ ఆధారంగా వెతుకుతుండగా పెద్దన్నయ్య గణపతికి రామారావు మృతదేహం, కత్తి కనిపించాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం తరలించగా ఎస్పీ జీఆర్ రాధిక, టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డిలు ఆస్పత్రికి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. అనంతరం సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.


హత్యలకు, ఆత్మహత్యకు వాడిన వేట కత్తి

### రైతు సంఘాల బలోపేతానికి చర్యలు

కవిటి: రైతు సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఉద్యానశాఖ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీ రత్నాచార్యులు అన్నారు. రైతు సంఘాలకు ఇస్తున్న రాయితీల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఆర్‌వీవీ ప్రసాద్‌తో కలిసి కవిటి మండలంలో నిర్మిస్తున్న హార్టికల్చర్ కలెక్షన్ సెంటర్ల నిర్మాణాల పురోగతిని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 28 యూనిట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. వీటిలో 18 సెంటర్ల నిర్మాణం తుదిదశకు చేరిందన్నారు. ఒక్కో యూనిట్‌ను ఉద్యానశాఖ ద్వారా రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తోందన్నారు. ఇందులో ప్రభుత్వం 75 శాతం రాయితీ కల్పిస్తోందన్నారు. అనంతరం మండల కొబ్బరి రైతుసంఘాల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రైతు సంఘాలకు ఉద్యానశాఖ ద్వారా అందిస్తున్న వివిధ రాయితీ పథకాల్ని వివరించారు. హెచ్‌ఓ పోలాకి మాధవీలత, బోర్డ్‌ఆఫ్‌డైరెక్టర్స్ అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్, కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు ప్రాధాన్యం

- టెక్కలి నూతన డీఎస్పీ బాలచంద్రారెడ్డి

టెక్కలి: టెక్కలి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బంది సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తానని డీఎస్పీగా నియమితులైన డి.బాలచంద్రారెడ్డి వెల్లడించారు. కొత్తగా ఏర్పాటైన పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయానికి డీఎస్పీగా నియామకమైన ఆయన బుధవారం విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని టెక్కలి, పాతపట్నం, కొత్తూరు, నరసన్నపేట సర్కిళ్ల సీఐలు, ఎస్సైలు డీఎస్పీ బాలచంద్రారెడ్డికి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించి ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో డీఎస్పీ మాట్లాడుతూ.. టెక్కలి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నేర నియంత్రణ లక్ష్యంగా పనిచేస్తామన్నారు. సీఐలు చంద్రమౌళి, వినోద్, వేణుగోపాలరావు, రాము ఉన్నారు.

# గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు

- ఐటీడీఏ పీవో కల్పనాకుమారి


స్థల పరిశీలన చేస్తున్న పీవో కల్పనాకుమారి

సారవకోట: గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నామని సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనా కుమారి చెప్పారు. సారవకోట మండల కేంద్రంలో గిరిజన సామాజిక భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని బుధవారం పరిశీలించారు. తొలుత మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధిహామీ పథకం ఫీల్డు అసిస్టెంట్లతో మండలంలో చేపడుతున్న పనుల స్థితిగతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల కేంద్రంలో జాతీయ రహదారికి అనుకుని కొండ పోరంబోకు స్థలాన్ని సామాజిక భవన నిర్మాణానికి కేటాయించారని.. అయితే ఈ స్థలం వివాదాస్పదంగా ఉందన్నారు. జేసీ, టెక్కలి సబ్‌కలెక్టర్లతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మండలంలోని గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దృష్టి సారిస్తున్నామన్నారు. దీంట్లో భాగంగా గిరిజన గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గిరిజన గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన చోట్ల ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. సారవకోట మండలంలో ఐటీడీఏ తరఫున పెట్రోల్ బంక్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. దీని కోసం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్నామన్నారు. తహసీల్దార్ ప్రవల్లికా ప్రియ, ఎంపీడీవో విశ్వేశ్వరరావు, ఎంఈవో ఎంవీ రమణ ఉన్నారు.

## భూమికి సారం..
# వారికి జీవనాధారం!


పొలంలో మేత మేస్తున్న గొర్రెల మంద

- తక్కువ ఖర్చుతో ఎక్కువ భూసారం
- పర్యావరణ పరిరక్షణకు దోహదం
- మందకాపునకు వేసవి అనుకూలం
- సేంద్రియ ఎరువుగా గొర్రెలు, మేకల వ్యర్థాలు

| జిల్లాలో పరిస్థితి ఇలా.. | |
|---|---|
| మండలాలు | 30 |
| గొర్రెలు, మేకల పెంపకందారులు | 17వేల కుటుంబాలు |
| గొర్రెలు | 6,23,641 |
| మేకలు | 2,77,268 |

ఎల్.ఎన్.పేట: రైతులు తమ భూములను సారవంతం చేసేందుకు వివిధ పద్ధతలను అవలంబిస్తున్నారు. దీనికి వేసవి కాలాన్ని వినియోగించుకుంటారు. భూసారాన్ని పెంచేందుకు దోహదపడే వాటిలో రెండు పద్ధతులు పాటిస్తున్నారు. వీటిలో మొదటిది పొలాల్లో గొర్రెలు, మేకల (జీవాల) మందలను కాపు కాయటం.. రెండోది చెరువు పూడిక మట్టి, కుళ్లిన గత్తంను పొలాల్లో వేయటం. ఈ రెండు పద్ధతులు పాటించిన పొలంలో సాగుచేసే పంటలు బాగా పండి అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పొలంలో జీవాల మందల కాపు కాయటంతో వాటి వ్యర్థాలతో భూమి సారవంతం కావడంతో పాటు వాటి పెంపకందారులకు ఆదాయ మార్గంగా ఉంటుంది. జీవాల పెంపకందారులు కోటబొమ్మాళి, రణస్థలం, గార, ఎల్.ఎన్.పేట, టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, పలాస, వజ్రపుకొత్తూరు, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం, ఆమదావలస, శ్రీకాకుళం రూరల్, కొత్తూరు, మందస మండలాల్లో ఎక్కువగా ఉన్నారు.

**తక్కువ ఖర్చుతో..**

పగలంతా మేతకు వెళ్లిన గొర్రెలు, మేకల మందను రాత్రికి రైతు పొలానికి తీసుకొనివస్తారు. ఒక రాత్రి పొలంలో ఉంచటం వలన అవి వేసే పేడ (గత్తం) భూ సారం పెంచుతుంది. పొలంలో జీవాల మంద ఉంచేందుకు గాను వాటి యజమానులకు పది కుంచాల బియ్యం (30 కిలోలు), రూ.200 నగదు, కూరగాయాలు, చింతపండు, పప్పులు రైతులు ఇస్తారు. ఎకరా పొలంలో నాలుగైదు రాత్రులు మంద కాపుకాయటం వలన భూమి సారవంతంగా మారుతుంది. పంట సమయంలో ఎరువులు, పురుగు మందుల ఖర్చు సగానికి తగ్గిపోతుంది. భూసారం పెంచేందుకు, పర్యావరణ పరిరక్షణలోను మంద కాపుకాయటం ఎంతగానో దోహదపడుతుంది. పురుగు మందు, ఎరువుల అవశేషాల్లేని పంట దిగుబడులను సాధించవచ్చు.

**వేసవిలో అనుకూలం..**

వేసవిలో భూసారాన్ని పెంచేందుకు దోహదపడే వాటిలో గొర్రెలు, మేకల మందలను కాపుకాసేందుకు ఎంతో అనుకూలం. ఖరీఫ్ తరువాత రబీలో ఆరుతడి పంటలు, వాణిజ్య పంటలు వేసుకుంటారు. పంట కోత తరువాత మందల కాపు కాస్తారు. వేసవి వర్షాలు పడినప్పుడు పొలం దుక్కి చేస్తారు. దుక్కి సమయంలో గొర్రెలు, మేకల వ్యర్థాలు భూమిలో కలిసి భూసారాన్ని పెంచుతాయి. వీటి వ్యర్థాలు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.

### ప్రోత్సహిస్తున్నాం



గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రభుత్వం నుంచి వస్తున్న రాయితీలు, ఇతర పథకాలు, బీమా వంటి అనేక సమాచారం తెలియజేస్తూ ప్రోత్రహిస్తున్నాం. జీవాల మందల వద్దకు వెళ్లి వాటి పెంపకంపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇస్తున్నాం. సీజన్ ప్రకారం వ్యాక్సినేషన్ వేస్తూ రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నాం.

-ఎం.లోకనాథం, పశుసంవర్ధక శాఖ ఏడీఏ, కోటబొమ్మాళి

### భూసారం పెరుగుతుంది



పొలంలో గొర్రెలు, మేకల మందలను కాపుకాయటం వలన భూసారం పెరుగుతుంది. ఎరువులు, పురుగు మందుల విని యోగం తగ్గుతుంది, విచక్షణా రహితంగా పురుగు మందులు, ఎరువుల వాడకంతో మిత్ర పురుగులు నశిస్తాయి. సేంద్రియ పద్ధలు పాటించటం వలన భూమి పొరల్లో ఉంటే మిత్ర పురుగులు సంఖ్య పెరుగుతుంది. ఏటా మందల కాపుకాయటం వలన భూమి సారవంతంగా మారుతుంది. పంట కాలంలో రైతులకు పెట్టుబడి తగ్గుతుంది.

-పైడి లతశ్రీ, ఏవో, ఎల్.ఎన్.పేట

### పూర్వీకుల నుంచి వస్తున్న ఆనవాయితీ



మాకు సుమారు 150 వరకు మేకలు, గొర్రెలు మందగా ఉన్నాయి. పూర్వీకుల నుంచి మంద పెంపకం ఆనవాయితీగా ఉంది. మా నాన్న నుంచి నేను కూడా మంద పెంచటం నేర్చుకున్నాను. రోజూ నాతో పాటు మరో ఇద్దరు కలసి జీవాలను మేతకు తీసుకుని వెళతాను. పొలాల్లో మంద కాపు కాయటం వలన భూమికి ఎంతో మేలు జరుగుతుంది.

-బొమ్మాళి శిమ్మన్న, గొర్రెల మంద యజమాని, కృష్ణాపురం, ఎల్.ఎన్.పేట